లైంగిక వేధింపుల్లో నిందితుడికి 20 ఏండ్ల జైలు

అంబర్‌పేట, ఏప్రిల్ 18: లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఓ యువకుడికి ఫోక్సో చట్టం కింద 20 ఏండ్ల జైలు శిక్ష పడిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ రావు తెలిపిన ప్రకారం, జియాగూడ, ఇందిరానగర్‌కు చెందిన ఖిలేవాలే నితీష్ సింగ్(20) పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసులో గురువారం ఫోక్సో స్పెషల్ సెషన్స్ జడ్జి పి.పుష్పలత నితీష్‌సింగ్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే అదనంగా మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

ఎం. నవీన

కవాడిగూడ, ఏప్రిల్ 18: ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన ప్రకారం, పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ మైసమ్మనగర్‌లో నివాసం ఉండే ఎం.నవీన(28) ఇందిరా పార్కు సమీపంలో ఓ ఇంట్లో పని మనిషిగా పనిచేస్తుంది. ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో నవీన భర్త శ్రావణ్ కుమార్ గురువారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఎస్ఐ గిరి శ్రీకాంత్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గత జనవరిలో నాలుగు రోజులు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగొచ్చినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

కాచిగూడ పరిధిలో మరొకరు..

మేఘన

కాచిగూడ, ఏప్రిల్ 18: దవాఖానలో యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాష్ తెలిపిన ప్రకారం, చాదర్‌ఘాట్‌లోని అజంపురా ప్రాంతానికి చెందిన నాగేశ్వర్ రావు కూమార్తె ఎన్.మేఘన(24) ఆరోగ్యం బాగలేకపోవడంతో గురువారం మధ్యాహ్నం కాచిగూడలోని ఎస్‌వీఎస్ దవాఖానకు వచ్చింది. బాత్‌రూమ్ వెళ్లొస్తానని వెళ్లిన మేఘన కొన్ని గంటలు గడిచినా రాకపోవడంతో కలత చెందిన కుటుంబ సభ్యులు దవాఖాన చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించ లేదు. దీంతో తల్లి కనకలక్ష్మి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దవాఖాన వెళ్లే సమయంలో మేఘన నీలి రంగు చుడీ పైజమా ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జైస్వాల్ గార్డెన్‌లో డాక్టర్ రేష్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

రేష్మకు జాతీయ స్థాయి గోల్డ్ మెడల్

● అభినందించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, ఏప్రిల్ 18: జైస్వాల్ గార్డెన్‌కు చెందిన డాక్టర్ రేష్మ, కోఠి ఈఎన్‌టీ దవాఖానలో అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్స్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈఎన్‌టీ విభాగం పరీక్షలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు కైవసం చేసుకుంది. దీంతో అత్యంత ప్రతిష్టాత్మక డాక్టర్ ఎస్.కామేశ్వరన్ గోల్డ్ మెడల్‌కు ఆమె ఎంపికైంది. మే నెల 10న ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా డాక్టర్ రేష్మ గోల్డ్ మెడల్ అందుకోనుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం జైస్వాల్ గార్డెన్‌లోని రేష్మ ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు. రేష్మ తలిదండ్రులు వినోద్ కుమార్, శారదతో పాటు జైస్వాల్ గార్డెన్ ప్రతినిధులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, రామా గౌడ్, సత్యనారాయణ, లక్ష్మణ్, రమేష్ గౌడ్, ఇంద్రసేనా యాదవ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన గోషామహల్ నాయకులు

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆశీష్ కుమార్ యాదవ్ నేతృత్వంలో కోటి శైలేష్ కురుమ మాజీ మంత్రి కేటీఆర్‌ను కలవగా పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల విజయానికి పాటు పడాలన్నారు. పార్టీలో కష్టించి పని చేసే వారికి తప్పక లాభం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా కోటి శైలేష్ కురుమ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేందుకు గాను అన్ని నియోజకవర్గాలలో ఉన్న కురుమ, యాదవులను జాగృతం చేసి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

– అబిడ్స్, ఏప్రిల్ 18

వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా కృషి

మ్యూజియంలోని రైల్వే చరిత్రను తిలకిస్తున్న రైల్వే ఏజీఎం ధనుంజయులు

కాచిగూడ, ఏప్రిల్ 18: ప్రాచీన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి రైల్వే సంస్థ కృషి చేస్తుందని దక్షణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులు అన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లోని మ్యూజియంలో ప్రపంచ వారసత్వదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రైల్వే ఏజీఎం ధనుంజయులు హాజరై మ్యూజియాన్ని సందర్శించి, అందులో ఏర్పాటు చేసిన స్టీమ్ ఇంజన్లతో మొదలైన చుక్‌చుక్ రైలు ప్రయాణం, క్రిక్ ఇంజన్లతో సూపర్ ఫాస్ట్ వేగాన్ని అందుకున్న పరిజ్ఞానాన్ని తెలిపే ఇంజన్లు, నాటి టైపురైటర్లు, టెలిఫోన్లు, పాత కాలపు కమ్యూనిషన్ పరికరాలను రైల్వేస్టేషన్ డైరెక్టర్ బాలాజీ ఏజీఎం ధనుంజయులుకు వివరించారు. 1916వ సంవత్సరంలో కాచిగూడ రైల్వేస్టేషన్‌ను ప్రారంభించిన మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఫొటో, నిజాం సర్కార్ రూపొందించిన పలు పరికారాలు, పాత సిగ్నల్స్ ఫొటోలను పొందుపరిచారు. నాటి స్టీమ్ ఇంజన్ మొదలుకొని నేటి విద్యుత్ రైలు ఇంజన్ వరకు వివిధ నమోనాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 23 వరకు ప్రజలకు, విద్యార్థులకు ఉచితంగా మ్యూజియాన్ని సందర్శించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శివేంద్రమోహన్, రెహమాన్, శ్రీధర్, ఏ.సుధీర్ కుమార్, కాచిగూడ రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, మేనేజర్ మీనాతో పాటు ఇతర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

21న ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేమరాజు విజయ్ కుమార్, సమన్వయ కర్త నిష్టల సుధా మాలలు..

చిక్కడపల్లి, ఏప్రిల్ 18: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో అలనాటి ప్రముఖ గాయని, ఆకాశవాణి కళాకారిణి దివంగత ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీల రజతోత్సవ (25 సంవత్సరాల) కార్యక్రమాన్ని ఈ నెల 21న ఆదివారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్ కుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల తెలిపారు. చిక్కడపల్లిలో వారు ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లవణ రాజా కల నృత్య నాటికను, ప్రముఖ గాయకులచే లలిత సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర, ప్రముఖ లలిత సంగీత కళాకారులు వేదవతి ప్రభాకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ సంగీత విద్యాంసులు డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మ, ఓరగంటి ఆనంద మోహన్‌లు 25వ సంగీత పోటీల విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మధుమతి కులకర్ణి, స్నేహ రాంచందర్, ఎం.లక్ష్మీ మానస, కోశాధికారి, యు.హరనాథ్ బాబు పాల్గొన్నారు.

ప్రా. కొలకలూరి జ్యోతికి ఉగాది పురస్కారం

మధుజ్యోతిని సత్కరించిన విశ్రాంత జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 18: క్రోధి నామ ఉగాది వేడుకలను పురస్కరించుకొని గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో రచయిత్రి, ప్రొఫెసర్ కొలకలూరి మధు జ్యోతికి ఉగాది పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి కాశీ విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని, మధు జ్యోతికి ఉగాది పురస్కారాన్ని అందించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ద్రవిడ విశ్వవిద్యాలయానికి చిన్న వయస్సులో ఉపాధ్యక్షురాలిగా పని చేయడం ఆమె విశేష ప్రతిభకు నిదర్శనమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఉప్పల శ్రీనివాస్ గుప్త, పబ్బ వైకుంఠం పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను కలిసిన నాయకులు..

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమవడంతో పాతబస్తీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, సాప కృష్ణ, గడుసు సాయిలు, నట రాజ్, నర్సింహా, లక్ష్మణ్, కృష్ణ గురువారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నామినేషన్ దాఖలు వివిధ అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు.

– చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 18

భక్తిశ్రద్ధలతో పుష్ప యాగం..



రాంనగర్ రామాలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గురువారం స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు. అంతకు ముందు మహా పూర్ణాహుతి, చక్ర తీర్థం, ధ్వజారోహణం, మహా నివేదనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డి.రవి యాదవ్, సభ్యుడు ఏ.శ్రీనివాస్, అర్చకులు వెంకటరమణాచార్యులు, వేణుగోపాల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్, ఏప్రిల్ 18

వైభవంగా కల్యాణోత్సవం..

కాచిగూడ తుల్జాభవన్‌లోని శ్రీ రామ మందిరంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. ఈ కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, తుల్జాభవన్ ఈవో అంజనారెడ్డి, భవన్ సిబ్బంది రాపోలు బాలకృష్ణ, అర్చకుడు నాగరాజు, శంకర్, మూర్తి దంపతులు, తదితరులు హాజరయ్యారు.

– కాచిగూడ, ఏప్రిల్ 18

ముగిసిన శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ సంగం వద్దనున్న రామాలయంలో గురువారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఆలయ మతాధిపతి రాహుల్ దాస్ ఆధ్వర్యంలో రాజు పంతులు స్వామి వార్ల విగ్రహాలకు చక్ర స్నానం చేయించారు. ఈ పూజలలో లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

– మెహిదీపట్నం ఏప్రిల్ 18

సన్మానం..

లంగర్‌హౌస్ డివిజన్ కాం గ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహన్ రెడ్డిని గు రువారం నియోజక వర్గం నా యకులు సన్మానించారు. కాంగ్రెస్ ఏ, బీ బ్లాక్‌ల అధ్యక్షులు కూరాకుల కృష్ణ, కె. చంటి బాబు, జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం ఏప్రిల్ 18

ఎంఐఎం ఇంటింటి ప్రచారం..

ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధిని అందిస్తున్నామని ఎంఐఎం పార్టీ అధ్యక్షులు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ప్రజలను కోరారు. కార్వాన్ నియోజకవర్గం నానల్ నగర్, గోల్కొండ, టోలిచౌకీ, లంగర్ హౌస్ డివిజన్లలోని పలు బస్తీలలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌తో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, ఎంఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, ఏప్రిల్ 18

చురుకుగా డ్రైనేజీ నిర్మాణ పనులు

నాంపల్లి నియోజకవర్గం విజయనగర్ కాలనీ డివిజన్‌లోని హుమాయూన్‌నగర్ జహరా మసీద్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణ పనులను జీహెచ్ ఎంసీ అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే మహ్మద్ మజీద్ హుస్సేన్ ఆదేశాలతో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి డాక్టర్ షేక్ ఖాసీంలు పర్యవేక్షించారు. ఈ మేరకు పనులు చురుకుగా సాగుతున్నాయి.

– మెహిదీపట్నం ఏప్రిల్ 18

నిబంధనలను పాటించాలి

వాహనదారునికి చలానా రాస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

కాచిగూడ,ఏప్రిల్ 18: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశా రు. నింబోలి అడ్డాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, హెల్మెట్ వాడకం, డ్రైవింగ్ లైసెన్స్, త్రిబుల్ రైడింగ్, పెండింగ్ చలాన్లపై వాహనదారులకు గురువారం అవగాహన క ల్పించారు. అనంతరం, ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సకాలంలో పెండింగ్ చలాన్లు కట్టి సహకరించాలని సూచించారు.

పదిమందిపై కేసులు నమోదు..

మందుబాబులపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బర్కత్‌పుర ఆంధ్ర యువతి మండలి సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. ఇందులో 10 ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయి.

కుటుంబంలో ఘర్షణ.. వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ,ఏప్రిల్ 18: కుటుంబంలో నెలకొన్న ఘర్షణతో మనస్తాపం చెందిన వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం, వట్టేపల్లిలోని ముస్తాఫా నగర్‌కు చెందిన సయ్యద్ మోహిన్ కుమారుడు సయ్యద్ నయీం(28) ఎలక్ట్రీషియన్. కొన్ని రోజులుగా భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. దీంతో భర్త మనస్తాపానికి గురై బుధవారం రాత్రి శివరాంపల్లి – ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య వట్టేపల్లి బ్రిడ్జి సమీపంలో ఎంఎంటీఎస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాచిగూడ రైల్వే పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

సమావేశంలో మాట్లాడుతున్న జన్ సేవా సంఘ్ ప్రతినిధులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 18: ఉత్తర భారత దేశం నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షలాది మందికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని జన్ సేవా సంఘ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి పత్రాన్ని సమర్పిస్తామని సంఘ్ తెలిపింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్పీ సింగ్, రాజీవ్ రాజన్ చౌదరి, కోశాధికారి బినిత్ కుమార్‌సింగ్ తదితరులు మాట్లాడారు. రాదేశ్యామ్, మహ్మద్ మూనాకర్ తదితరులు ఉన్నారు.

తెలంగాణను ముంచేయనున్న ఇథనాల్ సమస్య : హరగోపాల్

చిక్కడపల్లి, ఏప్రిల్ 18: చిత్తనూరు ఇథనాల్ పంపనే వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణలో ఇథనాల్ పరిశ్రమలు – ప్రజల భవిష్యత్తు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇథనాల్ కంపెనీలు ముంచేయబోతున్నాయని, ప్రధాన రాజకీయ పార్టీలు ఇథనాల్ సమస్యపై తమ వైఖరి ప్రటకించాలని కోరారు. అభివృద్ధి పేరుతో కాలుష్యకారక కంపెనీలను తీసుకొస్తున్నారని, వీటిని రాష్ట్ర వ్యాప్త ఉద్యమం ద్వారా ఎదుర్కోగలమని తెలిపారు. శాస్త్రవేత్త బాబూరావు, ఐఐటీ ముంబై శాస్త్రవేత్త సాగర్ ధార, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పశ్య పద్మ, పీడీఓబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు గోవర్ధన్, రెడ్‌స్టార్ కార్యదర్శి సైదయ్య, ఎం.రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

'మహా మనిషి ఏఎస్ రావు' ప్రోమో విడుదల

చిక్కడపల్లి, ఏప్రిల్ 18: డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక నిర్మించిన దాశరథి ఫిలిం సొసైటీ సమర్పించిన ''మహా మనిషి ఏఎస్ రావు'' టెలీ ఫిలిం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్లో దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినయ్ కుమార్ టెలీ ఫిలిమ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు దేశ స్వావలంబన కొరకు జీవితాంతం కృషి చేసిన గొప్ప శాస్త్రవేత్త అని తెలిపారు. మొట్టమొదటి అణు రియాక్టర్ అప్సర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారని వివరించారు. అలాగే శాస్త్ర సాంకేతిక ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను అనేకం రూపొందించి చేశానికి అంకితం ఇచ్చారని తెలిపారు. వారి చేసిన కృషి ఫలితంగా దేశం ఎంతో పురోభివృద్ధి చెందిందన్నారు.

అజ్రత్ బీబీ ఫాతిమా సమాధిని పునరుద్ధరించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 18: సౌదీ అరేబియా మదినే మునవర్‌లో ధ్వంసం చేసిన మహ్మద్ ప్రవక్త కుటుంబీకులు, కుమార్తె అజ్రద్ బీబీ ఫాతిమా సమాధులను తక్షణమే పునర్నిర్మించాలని ఆల్ బకీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. 1924లో అప్పటి ప్రభుత్వం ఈ సమాధులను కూల్చివేసిందని, వీటిని పునరుద్ధరించాలని గత శతాబ్ధ కాలంగా ఎన్నో సంస్థలు పోరాటం చేస్తున్నాయని చెప్పారు. ఫాతిమా సమాధులను పునర్నిర్మించాలని గురువారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆల్ బకీ హైదరాబాద్ చాప్టర్ సంస్థ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ బకీ సంస్థ ప్రతినిధులు డాక్టర్ షఫీక్ బాదర్, మౌలానా ఫయాజ్, మౌలానా హైదర్ జహేదా, మౌలానా అన్నాస్ రజ్వీ, ఫిరాసత్ అలీ బాక్రి, సయ్యద్ అలీ హుస్సేన్ జహేదీ, మీర్ సోహెల్ రజాక్, ముస్తఫా సాధిక్, జావేద్ హకీంబేగ్, పలు సంస్థల ప్రతినిధులు మౌలానా అన్నన్, మౌలానా జాఫర్ తదితరులు హాజరై మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు పెదలు పాల్గొన్నారు.

భూదాన భూముల దోపిడీపై ఉక్కుపాదం మోపాలి

సుల్తాన్ బజార్, ఏప్రిల్ 18: గత భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డితో సహా ఫోర్జరీ పత్రాలు సృష్టించి భూదాన భూములను దోచుకున్న భూమాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని అఖిల భారత సర్వసేన సంఘ్ ప్రధాన కార్య దర్శి గోరంక చంద్ర మహాపాత్రో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాంపల్లిలోని తెలంగాణ సర్వోదయ మండలి కార్యాలయంలో మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ అధ్యక్షతన 74వ భూదాన దినోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూదాన యోధుడు ఆచార్య వినోభా బావే, భూదాన దాత వెదిరె రామచంద్రారెడ్డిల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేల ఎకరాలు, వందల కోట్ల విలువైన భూదాన్ భూ కుంభకోణంపై విచారణకు రాష్ట్ర హై కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో ఆచార్య వినోభా భావే సంపన్నులైన భూస్వాముల నుంచి విరాళంగా సేకరించిన భూదాన భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ, భూదాన్ భూములను గత ప్రభుత్వాలు కొంత మేర పేదలకు పంచినా, మిగిలిన భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి భూదాన యజ్ఞ బోర్డు చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు అజీజ్ పాషా, మండలి నాయకులు కే చందు, బి.భాస్కర్, గిరి ప్రసా పాల్గొన్నారు.

20న మెగా జాబ్ ఫెయిర్

అబిడ్స్, ఏప్రిల్ 18: ఈ నెల 20న మాసబ్ ట్యాంక్ ఖాజా మాన్షన్ కన్వెన్షన్ హాల్‌లో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, డెక్కన్ బ్లూస్టార్స్ చైర్మన్ మన్నన్ ఖాన్ ఇంజనీర్ తెలిపారు. టీకేస్ హబ్ కన్సల్టింగ్ నేతృత్వంలో ఈ మెగా జాబ్ ఫెయిర్ జరుగుతుందని, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు అర్హులన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ ఫెయిర్‌కు దాదాపు 50 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 83743 15052లలో సంప్రదించాలని కోరారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్ట్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 18: యువకుడిని హత్య చేసిన ఘటనలో ఐదుగురు నిందితులను బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఓ బాలుడిని జువైనల్‌కు తరలించారు. పోలీసులు గురువారం తెలిపిన ప్రకారం, బహదూర్‌పురా కిషన్‌బాగ్‌కు చెందిన షేక్ ఫైబాజ్(22), షేక్ షాన్‌వాజ్(23), షోయబ్‌ఖాన్(30), మహ్మద్ ఫరూఖ్(20), సయ్యద్ అక్బర్(29) లతో పాటు మైనర్‌తో కలిసి వీరికి స్నేహితుడైన మహ్మద్ ఖలీల్(23)తో ఈ నెల 17న బహదూర్‌పురా నాలా వద్ద మద్యం సేవించారు. అనంతరం ఐదుగురిలో ఒక్కరిపై మహ్మద్ ఖలీల్ చేయి చేసుకున్నాడు. మహ్మద్ ఖలీల్ తండ్రి మహ్మద్ మహబూబ్ వచ్చి కొడుకు ఖలీల్‌ను కుస్తీ పోటీలు జరుగుతున్న స్థలం నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తుండగా, ఆవేశానికి లోనైన ఐదుగురు నిందితులు ఖలీల్‌ను కత్తులతో పొడిచి పారిపోయారు. నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రచారం

కవాడిగూడ, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల నేపథ్య